క్లుప్తంగా

పోలేరమ్మకు పూజలు.. భారీగా అన్నదానం



మాచర్ల: పాత మాచర్లలోని శ్రీ పోలేరమ్మ దేవాలయ ప్రాంగణంలో మంగళవారం భారీ అన్నదానం జరిగింది. దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణ మాసం ముగింపు సందర్భంగా పూజలు చేశారు. భక్తులు, ప్రజలు పోలేరమ్మను దర్శించుకొని, పూజలు చేశారు.

మండాదిలో వైద్య శిబిరం



వెల్దుర్తి: ఇటీవల కురిసిన వర్షాలకు మండాదిలో జ్వరాలు సోకటంతో ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు లక్ష్మీ ప్రసన్న మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. రక్త నమూనాలు సేకరించి, జ్వర బాధితులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి పడి ఒడిశా వ్యక్తికి గాయాలు



దాచేపల్లి: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి ప్రయాణికుడు తీవ్రంగా గాయపడిన ఘటన నడికుడి రైల్వే జంక్షన్‌లో మంగళవారం జరిగింది. ఒడిశా ప్రయాణికుడు(32) శబరి ఎక్స్‌ప్రెస్ రైలు నడికుడి జంక్షన్‌లో ఆగి కదులుతున్న క్రమంలో జారి కిందపడ్డాడు. రైలు బలంగా ఢీ కొట్టడంతో అతని కుడి చేయి పూర్తిగా విరిగి రైలు పట్టాలపై పడింది. అతనిని ప్లాట్ ఫాంపై చేర్చి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటన స్థలాన్ని జీఆర్పీ పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు. ప్రయాణికుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మెప్మా సమైఖ్యల లావాదేవీలపై ఆడిట్



మాచర్ల: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం జిల్లాకు చెందిన ప్రైవేటు ఆడిటర్లు 2023 – 24 స్లమ్ ఏరియా సమైఖ్యల లావాదేవీలు, రుణాలు, రికవరీలు గ్రూపుల లావాదేవీలపై ఆడిటింగ్ నిర్వహించారు. మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో జిల్లాకు చెందిన ప్రైవేటు సంస్థ అజాద్ అండ్ కో 31 సమైఖ్యలకు సంబంధించిన గ్రూపు రికార్డులను తనిఖీ చేసింది. ఆడిటర్లు రాజేష్, రవి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని 220/132 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఎ.శివనాగిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలకల్లు, జానపాడు, పిడుగురాళ్ల, అనుపాలెం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలన్నారు.

ఊరు ఒడిశా..చేతి వృత్తి ఒడుపుగా

- వినాయక చవితి ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు
- వివిధ ఆకృతుల్లో అందుబాటులో గణపయ్య విగ్రహాలు
- పిడుగురాళ్ల స్థావరంగా.. తీర్చిదిద్దుతున్న ఒడిశా కళాకారులు



వినాయక చవితి ఉత్సవాలకు సిద్ధంగా గణపతి విగ్రహాలు

పిడుగురాళ్ల: వినాయక చవితి వేడుకలకు బొజ్జ గణపయ్య విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. మండపాలు ఏర్పాటు చేసి, అంగరంగ వైభవంగా ఉత్సవాలు చేసేందుకు ఇప్పటికే విగ్రహాల తయారీదారులకు అడ్వాన్స్‌లు ఇచ్చారు.

ఒడిశా నుంచి వచ్చిన కళాకారులు పట్టణంలోని ఏబీసీ స్కూల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గుడారాలను ఏర్పాటు చేసి, వినాయకుని విగ్రహాలను మూడు నెలల నుంచి తయారు చేస్తున్నారు. 160 విగ్రహాలను తయారు చేసి, విక్రయానికి సిద్ధంగా ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. 3 నుంచి 15 అడుగులు ఎత్తు ఉన్న విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. వాటి రూ.1,500 నుంచి రూ.15 వేల వరకు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

20 ఆకృతులు..

వినాయక చవితిని ఈ నెల 7న జరుపుకునేందుకు గణపతి విగ్రహాలను ఆకర్షణీయంగా 20కి పైగా ఆకృతుల్లో తీర్చిదిద్దారు. చిన్న పిల్లల కోసం ప్రత్యేకించి మూడు అడుగుల లోపు గణపతి విగ్రహాలు తయారు చేశారు.

ఒడిశా కళాకారులు

గణపతి విగ్రహాలను ఒడిశా కళాకారులు చాలా ఒడుపుగా తిర్చిదిద్దతున్నారు. విగ్రహాల తయారీనే వృత్తిగా ఈ కుటుంబాలు ఇక్కడే జీవిస్తున్నాయి. విగ్రహాల తయారీ కోసం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో పాటు కొబ్బరి పీచును ఉపయోగిస్తున్నారు.

విగ్రహాలు అమ్ముడు పోతేనే లాభాలు



ఒడిశా నుంచి పిడుగురాళ్లకు వచ్చి వినాయకుని విగ్రహాలను తయారు చేస్తున్నాం. మావి 10 కుటుంబాలున్నాయి. విగ్రహాలు పూర్తిగా అమ్ముడుపోయిన తర్వాత వచ్చిన లాభాన్ని అందరం పంచుకుంటాం. విగ్రహాలు అమ్ముడుపోకపోతే నష్టం వస్తుంది.

– రనోజిత్, విగ్రహాల కళాకారుడు, ఒడిశా

భక్తులకు నచ్చే ఆకృతులు



వినాయక చవితిని భక్తులు అంగరంగ వైభవంగా భారీ ఖర్చుతో నిర్వహిస్తున్నారు. అందుకు తగ్గట్లుగా రంగు రంగుల విగ్రహాలను తయారీ చేసి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నాం. పండగ నాటికి పూర్తిగా విక్రయాస్తామనే నమ్మకం ఉంది.

– దీపంకర్, విగ్రహాల కళాకారుడు, ఒడిశా

వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి కార్యవర్గం ఎంపిక

నేడు ప్రమాణస్వీకారం



విలేకరులతో మాట్లాడుతున్న దేవాలయ కమిటీ సభ్యులు

మాచర్ల: పట్టణంలోని పాత మాచర్లలో వేంచేసియున్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు అధ్యక్షులు భవనాశి వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నూతనంగా తాను అధ్యక్షులుగా, ప్రధానకార్యదర్శిగా సన్నిధి హనుమంతరావు, కోశాధికారిగా మాశెట్టి వెంకట సైదారావు, ఉపాధ్యక్షులుగా గోళ్ల జనార్ధనరావు, కూనిశెట్టి చిన వెంకటేశ్వర్లు, గుండా వెంకట మల్లికార్జునరావు, పోలూరి సత్యనారాయణ, తుమ్మేపల్లి అంకేశ్వరరావు, రంగా జనార్ధనరావు, మారం సత్యనారాయణ, చిన్ని చంద్రశేఖర్‌రావులను ఎంపిక చేయటం జరిగిందన్నారు. సహాయ కార్యదర్శులుగా తిరివీధి వెంకట నాగేశ్వరరావు, కొత్తమాసు చెన్నకేశవరావు, భవనాశి రవితేజ, కొత్తా శ్రీదేవి, పరిటాల ధనలక్ష్మి, వేముల విజయలక్ష్మి, మేడా వెంకటలక్ష్మి, చిన్ని ఆదిలక్ష్మిలతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవటం జరిగిందన్నారు. నూతన కార్యవర్గం ముందుగా శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆర్యవైశ్యులు, అమ్మవారి భక్తులు భారీ స్థాయిలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోశాధికారి మాశెట్టి వెంకట సైదారావు, ఉపాధ్యక్షులు కూనిశెట్టి చిన వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి తిరివీధి వెంకట నాగేశ్వరరావు, భవనాశి రవితేజలు కోరారు.

తగ్గిన వరద ఉధృతి

ముంపు నుంచి బయట పడ్డ మత్స్యకారుల ఇళ్లు



దాచేపల్లి: మండలంలోని రామాపురం మత్స్యకారుల కాలనీకి వరద ముప్పు తప్పింది. కృష్ణా నదిలో వరద నీటి ఉధృతి తగ్గిపోవడంతో మంగళవారం మత్స్యకారుల ఇళ్లు వరద నీటి నుంచి బయటపడ్డాయి. కాలనీలోని 60 ఇళ్లు గత నాలుగు రోజులుగా వరద నీటిలోనే ఉన్నాయి. దీంతో ఇళ్లలో భారీగా ఇసుక, మట్టి పేరుకుపోయింది. ఇళ్ల మధ్యలోకి చెత్తా చెదారం, మొక్కలు కొట్టుకొచ్చాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయడంతో కాలనీలో అంధకారం నెలకొని ఉంది. వరద ప్రవాహం పూర్తిగా తగ్గకపోవడంతో పునరావస కేంద్రంలోనే స్థానికులు తలదాచుకుంటున్నారు.

మండాదిలో పారిశుద్ధ్య పనులు

వెల్దుర్తి: మండాది గ్రామంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించారు. మురుగు కాల్వల్లో పూడిక తీత చేపట్టారు, గ్రామంలో అన్నీ వీధులను శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు తెలిపారు.

సస్యరక్షణతో నష్ట నివారణ



పిల్లుట్లలోని మిరప చేనులో మొక్కలు పరిశీలిస్తున్న అధికారులు

మాచవరం: తక్షణం సస్యరక్షణ రక్షణ చేపడితే ఉద్యాన పంటలను కాపాడుకొని నష్టాన్ని తగ్గించుకోవచ్చని ఉద్యానశాఖ అధికారి వై.మోహన్ తెలిపారు. పిల్లుట్ల, మల్లవోలు గ్రామాల్లో సోమవారం ఉద్యాన పంటలను ఆయన పరిశీలించి, రైతులకు తగు సూచనలు, సలహాలు తెలియజేశారు. వర్షాలకు లోతట్టు పొలాల్లో నీరు నిలబడి పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. అధిక తేమ కారణంగా వేర్ల ద్వారా మొక్కలకు సరైన పోషకాలు అందక పోవడం, తలలు వాల్చడం, ఉరకలెత్తడం, సూక్ష్మపోషక ధాతు లోపాలు ఏర్పడతాయని తెలియజేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పంట దశ, ముంపు ఉధృతిని బట్టి సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటలను రక్షించుకొని, నష్టాన్ని తగ్గించుకోవచ్చని ఆయన తెలియజేశారు. నష్ట నివారణ చర్యలను తెలియజేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

దుర్గి: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పార్టీ మండలాధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం తమ పార్టీ కార్యాలయంలో నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. పార్టీ నిర్ణయించిన లక్ష్యం మేరకు మండలంలో సభ్యత్వాలను నమోదు చేయిస్తామన్నారు. పార్టీ సీనియర్ నాయకులు కోటేశ్వరరావు, కోటేశ్వరరావు, మల్లయ్య, మరియదాసు, అధ్యక్షురాలు లక్ష్మి నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ కార్యవర్గం

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాచర్ల నియోజక వర్గ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని మంగళవారం రాత్రి ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షులు కొరటా వెంకట రమణ తెలిపారు. వాణి విద్యానికేతన్ ప్రిన్సిపాల్, అధ్యక్షులుగా కేవీ రమణ (7వ సారి), జెనిత్ స్కూల్ ప్రిన్సిపల్, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాసులు, కిడ్స్ పాఠశాల ప్రిన్సిపాల్, కోశాధికారిగా, చీఫ్ అడ్వైజర్‌గా రామకృష్ణశాస్త్రి, గౌరవాధ్యక్షుడిగా బి.వెంకట రెడ్డి, ఉపాధ్యక్షులుగా వేముల వెంకటేశ్వర్లు, కె.వెంకటరావు, జాయింట్ సెక్రెటరీలుగా డి.శ్రీనివాస రావు, వి.హారికా రెడ్డి, కోశాధికారిగా ఎస్.శ్రీనివాస రావు, సబ్ ట్రెజరర్‌గా సురేష్ కుమార్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. పలు మండలాల అసోసియేషన్ ప్రిన్సిపల్స్, హెచ్‌ఎంలు అసోసియేషన్ సభ్యులను అభినందించారు.

యాజమాన్య పద్ధతులతో నష్ట నివారణ



నీట మునిగిన వరి చేనులో ఏఓ, సిబ్బంది

రెంటచింతల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన వరి పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం రెంటచింతల గ్రామ శివారులోని నీట మునిగిన వరి పంట పొలాలను ఆయన సందర్శించారు. నాట్లు వేసిన వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వీఏఏ గొంటు కృష్ణారెడ్డి, రైతులున్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి



పిడుగురాళ్లరూరల్ : అపర భగీరథుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి అని గురజాల నియోజకవర్గ యువ నేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. కరాలపాడు గ్రామంలో వైఎస్సార్ వర్ధంతి వేడుకలు సోమవారం రాత్రి నిర్వహించారు. బ్రాహ్మణపల్లిలోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ సుబ్బారెడ్డి, జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, నంబూరి పుల్లారెడ్డి, భూమిరెడ్డి యల్లారెడ్డి, మద్దసాని రమణారెడ్డి, యోగయ్య, జగన్, నటరాజు, కోటా కిరణ్, ముసలయ్య, కోటిరెడ్డి, బుర్రి కృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, నాసర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, ఆదిరెడ్డి, సర్పంచ్ షేక్ ఖాశింబి, ఎంపీటీసీ గురవారెడ్డి పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



పిడుగురాళ్ల: వర్షాలకు పిడుగురాళ్ల పట్టణంలోని విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పట్టణంలోని చిన్న కాలువ సమీపాన రెండు విద్యుత్ స్తంభాలు కింద పడటంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ స్తంభాలు అలాగే ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ స్తంభాలను వెంటనే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.

ఏసుక్రీస్తు కృప పొందాలి



మాచర్ల: బైబిల్‌లోని సూక్తులను పాటించి ఏసుక్రీస్తు కృప పొందాలని నల్గొండ జిల్లా రెవ కన్నా డేవిడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలని లో ఇమ్మానుయేలు ఏజీ ప్రార్థన మందిరం 26వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రత్యేక సందేశమిచ్చారు. వార్షికోత్సవాలకు స్థానిక సంఘ కాపరి ఎన్ఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించి, సందేశాన్ని అందించారు. పల్నాడు సేవకుల పాస్టర్ల సంఘం అధ్యక్షుడు, పాస్టర్ జాన్ వెస్లి, కార్యదర్శి మోహన్‌బాబు, కోశాధికారి యెహోషువా, లియాజర్, భూషణం పాల్గొన్నారు. క్రైస్తవ మహిళలు ఏసుక్రీస్తు పాటలు స్తుతించారు. ప్రేమవిందును అందజేశారు.

గిరిజన తండాల్లో విషజ్వరాలు

వెల్దుర్తి: మండలంలోని గిరిజన తండాల్లో విష జ్వరాలు ప్రబలి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎంలు రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తున్నారు. గిరిజన తండాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా అమలు కాకపోవడంతో ప్రతి ఇంటికి ఇద్దరు జ్వరంతో బాధపడుతున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీస్ శాఖకు సహకరించండి



సీఐ శ్రీనివాసరావు

కారెంపూడి: వినాయక చవితి వేడుకల నిర్వహణకు పోలీస్ శాఖ సూచించిన నిబంధనలు పాటించి, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కారెంపూడి సీఐ టీవీ శ్రీనివాస రావు మంగళవారం కోరారు. విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్లెక్సీలు, వివాదాస్పద స్థలంలో మండపాలు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు. గొడవలకు తావిచ్చే విధంగా వ్యవహరించకూడదని పేర్కొన్నారు. మండపంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి, నిమజ్జనం ఊరేగింపు రూట్ మ్యాప్ ఇవ్వాలని చెప్పారు. ఐదుగురు కమిటీ సభ్యులు ఫోటోలు, ఆధార్ కార్డులను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాలని సీఐ కోరారు.

సింగిల్ విండో క్లియరెన్స్ తప్పనిసరి



ఎస్ఐ సీహెచ్ నాగార్జున

రెంటచింతల: వినాయక చవితి సందర్భంగా మండపాల్లో విగ్రహాల ఏర్పాటుకు సింగిల్ విండో క్లియరెన్స్ విధానం తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.గతంలో పందిళ్లు, మైకులు, ఊరేగింపు, పోలీసులు, అగ్ని మాపక, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖాధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉండేదన్నారు. నిర్వాహకుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానం తీసుకొచ్చినట్లు చెప్పారు. చవితి నిర్వాహకులు 79950 95800 నంబరుకు వాట్సాప్ ద్వారా హాయ్ అనే సందేశం పంపిస్తే ఎన్ఓసీ(నిరభ్యంతర) పత్రం కోసం అనుసరించాల్సిన విధానం మొత్తం వస్తుందన్నారు. జీఏఎస్ఈఎస్ హెచ్‌టీఎస్‌ఏపీ. ఎస్ఈటీ అనే వెబ్‌సైట్‌లో కమిటీ సభ్యుల వివరాలు, మండపం ప్రదేశం, పోలీస్ స్టేషన్ పరిధి తదితర పూర్తి వివరాలు దరఖాస్తులో తెలపాలన్నారు.

ప్రజల ఆశాజ్యోతి వైఎస్సార్



పాలువాయిలో వైఎస్సార్ విగ్రహానికి నర్శిరెడ్డి నివాళి



రెంటచింతలలో పులిహోర పంపిణీ

రెంటచింతల: మహా నేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర ప్రజల ఆశాజ్యోతిగా ఎప్పటికీ నిలిచి ఉంటారని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొంతిరెడ్డి నర్శిరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని పాలువాయి గ్రామంలో నిర్వహించిన వైఎస్సార్ 15వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహా నేత వైఎస్సార్ రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజల ఆర్థికంగా ఆదుకునేందుకు సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. రెంట చింతల–3 ఎంపీటీసీ గాలి ప్రతాప్ రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. పులిహోర పంపిణీ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ ఎం.ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస రెడ్డి, నాయకులు గోవింద్ రెడ్డి, వైఎస్సార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నష్టపరిహారం మంజూరుకు కృషి

పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే జూలకంటి



పంట భూముల పరిశీలనలో ఎమ్మెల్యే జూలకంటి

వెల్దుర్తి: వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు నష్ట పరిహారం అందించేందుకు కృషి చేస్తానని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం మండాది గ్రామంలో నష్టపోయిన పంట భూములను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లోని మిర్చి, పత్తి, కంది పంటలు దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులు వివిధ గ్రామాల్లో పంటలు నష్టపోయిన ప్రాంతాలను పరిశీలిస్తున్నారని, ఉన్నతాధికారులకు నివేదిక పంపించి, నష్టపరిహారం మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఏడీఏ జగదీశ్వరరెడ్డి, ఏఓ పుల్లారెడ్డి, హార్టి కల్చరల్ అధికారి సురేష్, టీడీపీ నాయకుడు కుర్రి శివారెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి, వీఆర్ఓ కోటయ్య, సిబ్బంది ఉన్నారు.

చవితి వేడుకలకు అనుమతి తప్పనిసరి



దుర్గి: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వినాయక చవితి వేడుకలకు అనుమతి పొందాలని ఎస్ఐ సుధీర్‌బాబు మంగళవారం తెలిపారు. నిర్వాహకులు 79950 95800 నంబరకు వాట్సాప్ ద్వారా హాయ్ అనే సందేశం పంపిస్తే నిరభ్యంతర పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ, మొత్తం వాట్సాప్ ద్వారా మొబైల్‌కు వస్తుందన్నారు.